క్లుప్తంగా

రేపు చోడవరంలో మెగా జాబ్ మేళా

చోడవరం రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ఏపీఎస్‌డీసీ, కళాశాల స్కిల్ హబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉదయం **9 గంటలకు** జాబ్ మేళా ప్రారంభం అవుతుం**దన్నారు. ఆ** రోజు సాయంత్రం వరకు జరగను**న్న మేళాలో** అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్, **హెల్త్‌కేర్** సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. **చోడవరం,** మాడుగుల అసెంబ్లీ నియోజకవ**ర్గాల పరిధి**లోని నిరుద్యోగ యువకులు **జాబ్ మేళాకు** హాజరై సదవకాశాన్ని సద్వినియో**గం చేసుకో**వాలని స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ **వి.అప్పలనా**యుడు తెలిపారు. ఉద్యోగ మేళాకు **హాజరయ్యే** నిరుద్యోగ అభ్యర్థులు తమ బయో**డేటాలతో,** వారికున్న అర్హతల జెరాక్సు ప్రతు**లతో సంబం**ధిత సంస్థల ప్రతినిధులను సం**ప్రదించాలని,** ఇతర వివరాల కోసం స్కిల్ హబ్ **ఇన్‌స్ట్రక్టర్** శ్రీనివాస్‌ను 9494791935 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సంపూర్ణ పౌష్టికాహారాన్ని తీసుకోవాలి


వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారి శైలజ


కె.కోటపాడు : గర్భిణులు, బాలింతలు పౌష్టిక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. వి.సంతపాలెం గ్రామంలో సోమవా రం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలు జరిపారు. 119 మందికి వైద్య పరీక్షలను చేసి మందులు ఇచ్చారు. 12 మంది గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూడడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వర్షం


కె.కోటపాడులో కురుస్తున్న వర్షం

కె.కోటపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో పలు గ్రామాల్లో సోమవారం వర్షం కురిసింది. పది రోజులుగా వర్షాలు లేకపోవడంతో సాగులో ఉన్న వరిపంట భూములు నెర్రెలు వారే పరిస్థితికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలు వరిపంటకు మేలు చేస్తాయని సాగు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. గౌండుపాలెం, గుల్లేపల్లి, చౌడువాడ, కె.కోటపాడు, మల్లంపాలెం, పాచిలవానిపాలెం తదితర గ్రామాల్లో వర్షం విస్తారంగా కురిసింది.

నిలకడగా రైవాడ నీటిమట్టం


పుష్కలంగా నీటి నిల్వలతో కళకళలాడుతున్న రైవాడ జలాశయం

దేవరాపల్లి : రైవాడ జలాశయం నీటిమట్టం నిలకడగా ఉంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 113.50 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం జలాశయంలోకి 300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఖరీఫ్ పంటల సాగుకు కుడి, ఎడమ కాలువల ద్వారా 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ డీఈఈ జి.సత్యంనాయుడు తెలిపారు. వెరసి వరదనీటి నిల్వలతో కనుచూపు మేర జలాశయం కళకళలాడుతుంది.

ట్రాన్స్‌పోర్టు డ్రైవర్ల నిరసన

కశింకోట: ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం బయ్యవరంలో సిమెంట్ పరిశ్రమ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ పదేళ్లగా పని చేస్తున్న ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లకు జీతాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలో సెలవులు సైతం ఇవ్వడం లేదన్నా రు. సత్వరమే పరిశ్రమ యాజమాన్యం జీతాలు పెంచి ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకర్, ట్రాన్స్‌పోర్టు కార్మికులు పాల్గొన్నారు.

సాగునీరు వృథా... శివారు భూముల వ్యధ

- పూడుకుపోయిన పంట కాల్వలు
- రోడ్లపైకి సాగునీరు
- తాండవ ఆయకట్టు రైతుల ఆందోళన
- నిత్యం నీటి ప్రవాహంతో దెబ్బతిన్న అర్‌అండ్‌బీ రోడ్డు

రెండు మండలాల సరిహద్దులో తాండవ నీరు ప్రవహించే పిల్ల కాలువలు పూడుకుపోవడంతో సాగు నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. ప్రతి ఏటా తాండవ రిజర్వాయరు నుంచి ఖరీఫ్‌లో వరి సాగుకు 52 వేల ఎకరాలకు నీరు సరఫరా చేస్తుంది.


నర్సీపట్నం తుని మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిత్యం ప్రవహిస్తున్న తాండవ నీరు


పిచ్చి మొక్కలతో మూసుకుపోయిన ములగపూడి బెన్నవరం మధ్య తాండవ కాలువ

నాతవరం : తాండవ ఆయకట్టుకు నీరు ప్రవహించే ప్రధాన కాలువలు తప్ప పిల్ల కాలువలను అభివృద్ధి చేయకుండా వదిలేశారు. దీంతో ఎక్కడ చూసినా కాలువలు పూడికతో నిండిపోయి నీరు ప్రవహించ**లేని విధంగా ఉన్నాయి. ప్రధానంగా నాతవరం మండలం నుంచి నర్సీపట్నం మండలంలోకి ప్రవహించే పిల్ల కాలువలు పూర్తిగా పూడిక పిచ్చిమొక్క**లతో నిండిపోవడంతో సాగునీరు ప్రవహించలేదు. ములగపూడి ఎం.బెన్నవరం గ్రామాల వద్ద తాండవ పిల్ల కాలువలు బయటకు కన్పించని విధంగా కురుకుపోయాయి. ఆయా గ్రామాల వద్ద పంట పొలాలకు ప్రవహించే సాగు నీరంతా ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వృథాగా ప్రవహిస్తుంది. ఈ ప్రాంతంలో నర్సీపట్నం మండలం మెట్టపాలెం మెండికండి గ్రామాల ఆయకట్టు రైతులు శ్రమదానంతో కొంత మేర పిల్ల కాలువలు బాగు చేసుకుని తాండవ నీరు తమ పొలాలకు తరలిస్తున్నారు. ఇదే మాదిరిగా కోటవురట్ల కోటనందూరు మండలాలు పరిధిలో పిల్ల కాలువలు అధ్వానంగా ఉండడంతో శివారు ఆయకట్టు భూములకు నీరు ప్రవహించడం లేదు. **తాండవ రిజర్వాయరు పరిధిలో పెద్ద కాలువలు చిన్న కాలువలు కలుపుకొని మొత్తం సుమారుగా 120 కిలోమీటర్ల పొడవునా కాలువల్లో నీరు ప్రవహి**స్తోంది. నర్సీపట్నం తుని అర్‌అండ్‌బీ రోడ్డును అనుకొని అనేక చోట్ల తాండవ నీరు ప్రవహించే పిల్ల కాలువలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల వద్ద పిల్ల కాలువలు పూడుకుపోవడంతో నీరంతా ఆర్‌అండ్‌బీ రోడ్డుపైనే ప్రవహిస్తుంది. ఈవిధంగా రోడ్డుపై నిత్యం నీరు ప్రవహించడం వల్ల అక్కడ రోడ్డంతా శిథిలం అవుతుందని ప్రయాణికులు వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్ల ముందే నిత్యం సాగు నీరు వృథాగా పోతున్నా కనీసం ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమని ఆయకట్టుదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పలు గ్రామాల్లో 'పల్లె పండగ'

రోలుగుంట: మండలంలో 'పల్లెపండగ' పంచాయతీ వారోత్సవ కార్యక్రమాలు శరభవరంలో సోమవారం ప్రారంభమయ్యాయి. శరభవరం, కొవ్వూరు, కంచుగుమల, అడ్డసరం, జె.నాయడుపాలెం గ్రామాల్లో ఈ కార్యక్రమాలను టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు గుములూరి చంద్రమౌళి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు నిర్వహించారు. ఈ పంచాయతీలో 13 పనులకు రూ.4.03 కోట్లు ఉపాధి నిధులు మంజూరు కాగా సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కంచుగుమల కూడలిలో గల గంగాదేవి గుడి నుంచి అల్లువారి పాకల వరకూ గ్రావెల్, మెటల్ రోడ్డు పనులకు ఉపాధి నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు, ఏఈలు ఉమామహేశ్వరుడు,రాజు, శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు


గంగాదేవి గుడి దగ్గర గ్రావెల్, మెటల్ రోడ్డు పనులకు శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాజు

యువజన విభాగం స్టేట్ ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, కంచుగుమల సర్పంచ్ బండారు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రాజేశ్వరి, మహిళా విభాగం మండల నాయకురాలు శ్యామల, జె.నాయడుపాలెం మాజీ సర్పంచ్ కిల్లాడ అప్పలరాజు, నరేష్, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు తమ్ముునాయుడు పాల్గొన్నారు.

పల్లె పండగలో గిరిజనుల సమస్యలు పట్టవా?

- ఎమ్మెల్యే రాజు తీరుపై గిరిజనుల అసంతృప్తి
- రోడ్డు పనులు వాయిదా వేయడంపై మండిపాటు

రోలుగుంట: మండలంలో పలు గ్రామాల ఆదివాసీ గిరిజనులు పలు పోరాటాలు చేసి రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించుకున్నారు. మంజూరైన నిధులతో సోమవారం పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొన్న చోడవరం టీడీపీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు కలిసారు. నిధులు మంజూరైన గిరిజన గ్రామాల్లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేయాలని కోరారు. అయితే ఎమ్మెల్యే మాత్రం తమ కార్యక్రమాన్ని వాయిదా వేసి వెళ్లిపోయారని కిల్లో మహేష్, కిల్లో రాజేష్ తెలిపారు. ఎన్నో ఎళ్లగా కొండ శిఖరాగ్ర భాగాన ఉన్న తమ గ్రామాలకు రహదారులు లేక అనేక ఇక్కట్లు పడుతున్నామని, దీనిపై పలుమార్లు నిరసనలు తెలపడంతో సీఎంవో కార్యాలయం స్పందించి జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక


శరభవరం పల్లె పండగ సభలో ఎమ్మెల్యే రాజును కలిసిన గిరిజనులు

ఆదేశాలు జారీ చేయగా, జిల్లా కలెక్టర్ స్పందిస్తూ రూ 2.50 లక్షలు బీటీ రోడ్డుకు మంజూరు చేశారని తెలిపారు. అయితే నిధులు మంజూరై ఇప్పటికి మూడు నెలలు కావస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, రహదారి పనులు ప్రారంభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వైబీ పట్నం నుంచి పెదగరువు వయా లోసింగి, కొరుప్రోలు గ్రామం నుంచి ఎం.కె.పట్నం వరకూ రోడ్డుపనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఈ రోడ్లపై ప్రయాణం భయం..భయం


మన్యపురట్ల వెళ్లే రోడ్డులో గోతులు


నర్సీపట్నం తుని మధ్య ములగపూడి వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి

నాతవరం : మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గోతుల రహదారిలో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి తాండవ రిజర్వాయరుకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మన్యపురట్ల, రాజుపేట, అగ్రహారం, ఉప్పరగూడెం , నాయుడుపాలెం గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ అడుగు వేయలేని విధంగా గోతులతో నిండి ఉన్నాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే నర్సీపట్నం తుని మధ్య అర్‌అండ్‌బీ రోడ్డు ములగపూడి , గాం , దీనగరం, ఎ.శరభవరం గన్నవరం మెట్ట వద్ద మన్యపురట్ల జంక్షన్ వద్ద ప్రమాదాలు తలపించేలా రోడ్డు దెబ్బతింది. ఈ రూటులో రాత్రి వేళల్లో ఆదమరిచి డ్రైవింగ్ చేసే వాహనదారులు అనేకమంది ప్రమాదాల బారిన పడ్డారు. మన్యపురట్ల జంక్షన్ వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు శ్రమదానంతో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతలు పూడ్చారు. ఇటీవల ములపూడి వద్ద పంట పొలాలకు ప్రవహించే తాండవ కాలువ నీరు రోడ్డుపై ప్రవహించడంతో రోడ్డంతా శిథిలమైంది. కళ్ల ముందే ఆర్‌అండ్‌బీ రోడ్లన్నీ శిథిలం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చినగొలుగొండపేట, గునుపూడి, మధ్యలో అర్‌అండ్‌బీ రోడ్డుపై కల్వర్టు శిథిలమై రోడ్డు మధ్యలో రంధ్రం ఏర్పడింది. ఈ రంధ్రం కారణంగా ద్విచక్ర వాహనాలు తప్ప కార్లు, ఇతర వాహనాలు ఈ రోడ్డులో రాకపోకలు సాగించడం లేదు. ఏసమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఈ ప్రాంతీయులు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన రోడ్లు బాగు చేయించాలని కోరుతున్నారు.

వర్సిటీలకు పొట్టిశ్రీరాములు పేరు కొనసాగించాలి

అనకాపల్లి: తెలుగు విశ్వవిద్యాలయాలకు పొట్టి శ్రీరాములు పేరు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో తొలగించాలని తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్‌లో తీర్మానించడం అన్యాయమని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం తెలిపారు. సోమవారం స్థానిక మెయిన్ రోడ్డు కన్యకాపరమేశ్వర ఆలయం రహదారిలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారకరామారావు 1985లో అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టారన్నారు. నేటి పాలకులు శ్రీరాములు పేరును తొలగించాలని నిర్ణయించడం అన్యాయమన్నారు. దీనిపై తక్షణమే పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, బొడ్డు సోమరాజు పాల్గొన్నారు.

మాడుగుల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 13 మద్యం షాపులు

మాడుగుల : మాడుగుల ఎక్సైజ్ స్టేషన్‌కు సంబంధించి సోమవారం జరిగిన మద్యం దుకాణాల వేలం పాటకు 292 దరఖాస్తులు అందాయని, వేలం పాటలో 13 షాపులు దక్కాయని ఎక్సైజ్ సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాడుగుల మండలానికి గెజిట్ సీరియల్ నంబరు 124కు మజ్జి బాబ్జి, 125, సోమిరెడ్డి జయప్రకాశ్, 126, జె.జగ్గారావు, 127, మళ్ల మహాలక్ష్మి, 128 వెల్లంకి ప్రసన్న కుమార్, చీడికాడ మండలానికి సంబంధించి 129 గ్రిడ్డి రామునాయుడు, 130 సబ్బవరపు చిన్నమ్ములు, 131 ఎల్లంకి నాని, రావికమతం మండలానికి సంబంధించి 132 ఎం.గోపాల్, 133 బుద్ద అప్పల వెంకట సత్యనారాయణ, 134 మూడెడ్ల రాజు, 135 వడ్డి రాంబాబు, 136 యర్రంశెట్టి రాజారావు వేలంపాట ద్వారా దక్కించుకున్నారని సీఐ తెలిపారు.

కె.జె.పురం దుర్గాదేవికి పూజలు


అమ్మవారికి పూజలను చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారికి ప్రతిరోజూ మహిళలు ప్రత్యేక పూజలను నిర్వహించడంతో పాటు మొక్కులు చెల్లిస్తున్నారు. సోమవారం దుర్గాదేవి మండపంలో పైలా ప్రసాదరావు, కమిటీ సభ్యులు పూజలను నిర్వహించారు.

గిరిజనుల భూ సమస్యలపై వినతి

రోలుగుంట: మండలంలో గల పలు గిరిజన గ్రామాల్లో దీర్ఘకాలంగా సాగు చేస్తూ, స్థానికంగా ఉన్న గిరిజనుల భూ సమస్యల పరిష్కారం కోరుతూ వారి సంఘం జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.అజయ్‌కుమార్ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. తరువాత తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన చోడవరం టీడీపీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజును కూడా కలసి వినతిపత్రం అందజేశారు. దీనిలో పనసలపాడు రెవిన్యూ పరిధిలో గల 139 సర్వే నంబర్ భూమిని సాగు చేస్తున్న స్థానికులకు, సమీప గ్రామంలో గల పెదపేటకు చెందిన గిరిజనులు సాగు చేస్తున్న భూమిల్లో స్థానికేతరుల నుంచి వస్తున్న భూసమస్యను పరిష్కరించి సాగుదారులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే రాజు స్పందిస్తూ గిరిజనుల అర్హతలను పరిశీలించి సమస్య పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్‌కు సూచించారు.

బోరు ఏర్పాటుకు రూ.లక్ష మంజూరు


రైతుల కల్లాల వద్ద భూమి పూజ చేసి బోరు పనులు ప్రారంభించిన ఎంపీటీసీ సత్యవతి

రోలుగుంట : మండలంలోని బుచ్చింపేట గ్రామానికి చెందిన ఉలబాల కుటుంబాల కల్లాల సముదాయం వద్ద బోరు ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు ఆ సిగ్మెంటు ఎంపీటీసీ ఉలబాల సత్యవతి అభ్యర్థన మేరకు రూ.లక్ష మంజూరు చేశారు. ఆ నిధులతో ఎంపీటీసీ సత్యవతి సోమవారం భూమిపూజ చేసి రిగ్గు పనులు ప్రారంభించారు. దీంతో ఇక్కడి కల్లాల రైతులు ఎంపీటీసీకి, ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 14 ఫిర్యాదులు


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డివిజన్‌లోని పలు సమస్యలపై 14 ఫిర్యాదులు వచ్చాయని ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మున్సిపాలిటీ శ్రీకన్య థియేటర్ మెయిన్ రోడ్డు ప్రాంతంలో మున్సిపాలిటీ కుళాయిల నుంచి తాగునీటి సరఫరా అధ్వానంగా ఉందని కె.రమణబాబు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారుల దృ**ష్టికి సమస్యను** తీసుకువెళ్లినా పట్టించుకోలేదని **ఫిర్యాదు చేశారు.** భూ సమస్యను పరిష్కరించాలని **కోరుతూ నాత**వరం మండలం, బెన్నవరంకు చెం**దిన ఎ.శంకరరా**వు అర్జీ పెట్టుకున్నారు. కోటవురట్ల **మండలం,** గొట్టివాడ గ్రామంలో సర్వే నంబరు 151లో 24 ఎకరాల ప్రభుత్వ భూమిని పంపిణీ చేసి ప్రొసీడింగ్ ఆర్డర్ ఇచ్చి భూమి అప్పగించలేదని ఆ గ్రామానికి చెందిన కొంత మంది ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. భూ సమస్యలు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలకు సంబంధించి ఫిర్యాదులు వచ్చినట్టు కార్యాలయ అధికారులు తెలిపారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట


సింగన్నదొరపాలెంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బండారు, పూర్ణిమాదేవి

కె.కోటపాడు: గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైయినేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీటను వేయనున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. మండలంలో పల్లెపండగ–పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆరు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆయన డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ సింగన్నదొరపాలేనికి రూ.50లక్షలు, కె.జె.పురానికి రూ.19.85 లక్షలు, ఎ.కోడూరుకు రూ.45లక్షలు, ఆర్.వై.అగ్రహారానికి రూ.22లక్షలు, పోతనవలసలకు రూ.20 లక్షలు, కొరువాడకు రూ.5 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రొంగలి మహేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు వెలగల లక్ష్మి, సింగంపల్లి నారాయణమూర్తి, ఎంపీటీసీలు రొంగలి లక్ష్మి, చీపురపల్లి అచ్చిబాబు పాల్గొన్నారు.


కేజీబీవీలో మౌలిక వసతుల కల్పనకు కృషి


జె.నాయుడుపాలెం కేజీబీవీ వసతి గృహాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

రోలుగుంట : కేజీబీవీకి కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలకు నిధుల మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేస్తానని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు తెలిపారు. రూ 2.5 కోట్ల ఏపీఈడబ్ల్యూఐడీసీ నిధులతో మండలం జె.నాయుడుపాలెం గ్రామంలో కాస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహం కొన్నేళ్ల క్రితం నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధమై అనివార్య కారణాలుగా వాయిదాపడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రాజు సోమవారం మండల విద్యాశాఖాధికారులు జాను, ప్రసాద్, జగ్గారావు, జీసీడీవో ఎస్.పద్మతో స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ కిల్లాడ అప్పలరాజు, నరేష్‌తో కలసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన హయాంలో ఈ వసతి గృహం ఏర్పాటుకు నిధులు మంజూరు చేశానని, నిర్మాణం పూర్తయినా ఐదేళ్ల విరామం తరువాత ఎమ్మెల్యేగా తానే ప్రారంభించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తానన్నారు. దీని అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానన్నారు. వసతి గృహం ప్రిన్సిపాల్ తులసి మాట్లాడుతూ ఇక్కడ 9,10, ఇంటర్ విద్యార్థులకు 50 మంది చొప్పున, 200 మంది బాలికలకు వసతి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్‌కుమార్, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ బాలరాజు, వైస్ ఛైర్మన్ కిల్లాడ రమణమ్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చినఅప్పనపాలెంలో పైడిమాంబ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు


చిన అప్పనపాలెంలో పైడిమాంబ ఆలయం


తిరువీధిలో పాల్గొన్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట: చినఅప్పనపాలెం గ్రామంలో గ్రామదేవత పైడిమాంబ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులంతా గ్రామ శివారులో సుమారు రూ. 50 లక్షలు దాతల సహాయంతో పైడిమాంబ అమ్మ వారి ఆలయం నిర్మించారు. 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆలయ ప్రతిష్టా కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. తొలిరోజు సోమవారం విఘ్నేశ్వర పూజ, కలశపూజ, నవగ్రహ పూజలు, అగ్నిప్రతిష్ట, నీరాజన మంత్రపుష్పాలతో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి తిరువీధి మహోత్సవం నిర్వహించారు. మంగళవారం అమ్మ వారికి కుంకుమ పూజలు, రుద్రాభిషేకాలు, విశేష హోమాలు ప్రత్యేక పూజలు, 16వ తేదీన అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, అమ్మవారి ద్వారపాలక శిలామూర్తుల ప్రతిష్టా మహోత్సవం, పూర్ణాహుతి శిఖర యంత్ర, విగ్రహావిష్కరణ ప్రతిష్టా మహోత్సవం, భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ కోవెల ఈశ్వరరావు, పురోహితులు బైరి సీతారామమూర్తి తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన


మాడుగుల జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు లెక్చరర్‌లు

నర్సీపట్నం : రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్లు సోమవారం పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఏపీ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శర్మ మాట్లాడుతూ జీవో నంబరు 114 ప్రకారం అందరిని రెగ్యులర్ చేయాలన్నారు. దశల వారిగా ఆందోళనకు స్టేట్ కమిటీ రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఆందోళనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన జీవో ప్రకారం ఎన్నో ఏళ్ల నుంచి పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతికి వినతి పత్రం అందజేశారు.

మాడుగుల : ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోయిన క్రమబద్ధీకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని స్థానిక జూనియర్ కళాశాల వద్ద కాంట్రాక్టు లెక్చరర్‌లు సోమవారం కళాశాలకు హాజరై వారు పసుపు రంగు రిబ్బన్‌లు కట్టుకుని నిరసన తెలిపారు. ఆగిపోయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్‌ల రెగ్యులైజేషన్ యాక్ట్ 10, జీవో నంబరు 114 మరలా పునరుద్ధరించి తమను ఆదుకోవాలని, వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జూనియర్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్లు ప్రశాంతి, హారిక, మణికేశ్వరి, అన్నపూర్ణ, రామకృష్ణ, సుమన్, డి.నాయుడు, చిన్నంనాయుడు పాల్గొన్నారు.